


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 189

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 6 డిసెంబరు 2023

## ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి..

### కేసీ వేణుగోపాల్ ప్రకటన

- ఎల్లుండి ప్రమాణ స్వీకారం చేస్తారని వెల్లడి
- సీనియర్లందరికీ ప్రాధాన్యత ఉంటుందని... టీమ్ వర్క్ చేస్తారని వ్యాఖ్య



**తెలంగాణ, కలంకౌంటర్ :** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని సీఎల్పీ నేతగా ఎన్నుకున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. రెండు రోజుల చర్చోపచర్చల అనంతరం ఈ రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు ఏఐసీసీ కార్యాలయంలో ఆయన ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని కొత్త ముఖ్యమంత్రిగా ప్రకటించారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికకు సంబంధించి నిన్న సీఎల్పీ భేటీ జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా రేవంత్ రెడ్డిని ఖరారు చేసినట్లు తెలిపారు. ఎల్లుండి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. సీనియర్లందరికీ ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నేతలు అందరూ టీమ్ వర్క్ చేస్తారని చెప్పారు. సీఎల్పీ సమావేశంలో మూడు తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు.

**రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సమావేశం..** తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులతో సమావేశమయ్యారు. రేవంత్ రెడ్డి ఎల్లుండి సాయంత్రం ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం



చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై సీఎస్ పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, జీఏడీ ముఖ్య కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఈ రోజు సాయంత్రం రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది.

## తుఫాను బాధితులకు భోజనం పెట్టలేరా?

- తుఫాను పై ప్రభుత్వ సన్నద్ధతా లేదు..బాధితులకు సాయమూ లేదు
- బాధిత గ్రామాలలో పలువురితో నేరుగా ఫోన్ లో మాట్లాడిన టీడీపీ అధినేత చంద్రబాబు
- కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉండాలంటూ పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచన
- హుద్ హుద్, తిత్లీ తుఫాన్ల సమయంలో పరిహారం పెంచి సాయం చేశాం
- పెరిగిన సాగు ఖర్చులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నేడు పరిహారం పెంచి అందించాలి
- టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు డిమాండ్



**విజయవాడ, కలంకౌంటర్ :** తుఫాను బాధితు ప్రజలకు తక్షణ అవసరం అయిన ఆహారం, నీళ్లు, షెల్టర్ ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తుఫానుపై ప్రభుత్వ సన్నద్ధతా లేదు. బాధితులకు సాయమూ లేదు అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మిచౌంగ్ తుఫాను బాధిత గ్రామాలకు చెందిన కొందరు ప్రజలతో చంద్రబాబు ఫోన్ లో మాట్లాడారు. ప్రభుత్వ సాయంపై ఆరా తీశారు. తమకు కనీసం భోజనం కూడా పెట్టేలేదని...ప్రభుత్వ స్పందన సరిగా లేదని వివిధ ప్రాంతాల్లోని ప్రజలు చంద్రబాబుకు చెప్పారు. తుఫాను ప్రభావంపై దాదాపు 12 వేల మంది పార్టీ నేతలు, కార్యకర్తలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులపై నాయకులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఉన్న నాయకుల ద్వారా పలు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వారి బాగోగులు తెలుసుకున్నారు. ప్రభుత్వం సాయం కోసం ఎదురు చూడకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధిత ప్రజలకు అండగా ఉండాలి అని సూచించారు. వెంటనే భోజనం, తాగునీరు అందేలా చూడాలని నేతలకు చెప్పారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలుగు దేశం పార్టీ ప్రజల కోసం పని చేస్తుందని, ఈ కష్ట సమయంలో చేతనైన సాయం ద్వారా ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. ఈ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా చేతలు గడప దాటడం లేదని చంద్రబాబు విమర్శించారు. దీనికి క్షేత్ర స్థాయి పరిస్థితులే నిదర్శనం అని మండిపడ్డారు. ఈ స్థాయి విపత్తు అని ముందే తెలిసినా...ప్రజలను అలెర్ట్ చేయడంలో విఫలం అయ్యారని, వ్యవస్థల నిర్వీర్యం వల్లనే నేడు ఈ దుస్థితి అన్నారు. హుద్ హుద్, తిత్లీ తుఫాన్ల సమయంలో ప్రత్యేక జీవోలతో సాయం విపత్తుల సమయంలో రైతులను ఆదుకోవడానికి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రత్యేక జీవోలు ఇచ్చి సాయం అందించాం. హుద్ హుద్ సమయంలో జీవో నెంబర్ 9 ద్వారా, తిత్లీ తుఫాన్ సమయంలో జీవో నెంబర్ 14 ద్వారా నష్ట పరిహారం పెంచి రైతులకు అండగా నిలబడ్డాం. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం లెక్కలు వేసుకోకుండా ఉదారంగా వ్యవహరించాలి. తెలుగు దేశం హయాంలో విపత్తుల సమయంలో సాయం పెంచి ఎలా ఇచ్చిందీ, వైసీపీ ప్రభుత్వం ఎలా కోతలు పెట్టిందీ అనే విషయాన్ని నేతలకు చంద్రబాబు వివరించారు. నాటితో పోల్చుకుంటే నేడు పెరిగిన సాగు ఖర్చులు, ఇతర భారాలను దృష్టిలో పెట్టుకుని పరిహారం మరింత పెంచి ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలుగు దేశం పార్టీ నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

## లంక భూములు, ఇళ్ల పట్టాల పంపిణీ మహోత్సవంలో పాల్గొన్న హోంమంత్రి తానేటి వనిత




**కొవ్వూరు,కలంకౌంటర్ :** తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం కొవ్వూరు మండలంలో పట్టాల పంపిణీ మహోత్సవంలో రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో చిడిపి గ్రామానికి చెందిన 97 కుటుంబాలకు లంక భూముల పట్టాల పంపిణీ, ఐ.పంగిడి గ్రామానికి చెందిన 32 కుటుంబాలకు ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని హోంమంత్రి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో కాసేపు ముచ్చటించారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపిన జగనన్న ప్రభుత్వానికి, హోంమంత్రి తానేటి వనితకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతూ తమ సంతోషాన్ని పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ లబ్ధిదారులు వారి మనసులో మాటలను, వారి సంతోషాన్ని వ్యక్తం చేయడం జగనన్న పాలన మీద వారి అభిమానాన్ని తెలియజేసిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన వెసులుబాటు వలన మొత్తం 129 మందికి లంక భూములు, ఇళ్ల పట్టాల పంపిణీ మహోత్సవాన్ని చేపట్టగలిగామన్నారు.






# తీరాన్ని తాకిన మిచాంగ్

## ● ప్రకాశం, గుంటూరు, కృష్ణ, వెస్ట్ గోదావరిలో, విశాఖ ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు

## ● చెరువులను తలపిస్తున్న పంట పొలాలు ● నెల్లూరులో నీటమునిగిన మాగుంట లేఅవుట్





**గుంటూరు,కలంకౌంటర్ :** తీవ్ర తుపాను మిచాంగ్ బాపట్ల సమీపంలో తీరాన్ని తాకింది. ఈ మేరకు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మిచాంగ్ తీవ్ర తుఫాన్ బాపట్ల సమీపంలో తీరాన్ని తాకింది. తుఫాను ప్రభావంతో ప్రస్తుతం ప్రకాశం, గుంటూరు, కృష్ణ, వెస్ట్ గోదావరిలో, విశాఖ ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై, నెల్లూరు జిల్లాలో గాలుల తీవ్రత కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ వర్షాలు కొనసాగనున్నాయి. తుఫాను ఉత్తర దిశగా నెమ్మదిగా ముందుకు కదులుతోంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుండి 100 కిలోమీటర్లు కొన్నిసార్లు 110 కిలోమీటర్లు గాలులు వీచనున్నాయి. ముంపు ప్రాంతాల్లో సమ–ుద్రం కూడా ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.



మత్స్యకారులు వేటకు వెళ్ళకూడదని హెచ్చరించారు. ఇటు రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో కూడా వర్షాలు ఓ మోస్తారుగా కురుస్తున్నాయి. మరో 24 గంటల పాటు వర్షాలు కొనసాగనున్నాయి. తుపాను తీరం దాటుతున్న నేపథ్యంలో బాపట్ల తీర ప్రాంతంలో భారీ ఈదురుగాలులతో వర్షం కురుస్తోంది. సముద్రంలో అలలు సుమారు 2మీటర్ల మేర ఎగసిపడుతున్నాయి. తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురు స్తున్నాయి. ముఖ్యంగా పలు తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో నష్టం ఎక్కువగా జరిగింది. రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లోనూ తుపాను ప్రభావం కనిపించింది. వరి, పొగాకు, పసుపు, అరటి పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

**కూలిన వృక్షాలు..రహదారులు జలమయం :** మిగ్‌జాం తీవ్ర తుపాను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాను వణికిస్తోంది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఉండి, భీమవరం, కాళ్ల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేతికందిన పంట కల్లాల్లోనే ఉండిపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల కోసిన వరి పంట పొలాల్లోనే మునిగిపోయింది. ముదినేపల్లి, కలిదిండి, పెదపాడు, నూజివీడు, భీమవరం, పాలకొల్లు, పెనుమంట్ర తదితర చోట్ల వరి పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద భారీగా నీరు నిలిచిపోయింది. ఆస్పత్రి లోపల కూడా నీరు చేరడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పెదవేగి, పెదపాడు, వట్లూరు తదితర ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా చెట్లు కూలిపోయాయి. పోలవరం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం తదితర మండలాల్లో వేరుశనగ, పొగాకు, మినుము పంటలు నీట మునిగాయి.

**చెరువులను తలపిస్తున్న పంట పొలాలు :** 'మిగ్‌జాం' ప్రభావంతో గుంటూరు జిల్లాలోని వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఎటు చూసినా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కాకుమాను, కొండపాటూరు, కొమ్మూరు, అప్పాపురం, గార్లపాడు, రేటూరు, బీకే పాలెం, బొడిపాలెంలో పంటలు పూర్తిగా నీటమునిగాయి. కొండపాటూరులోని పోలేరమ్మ గర్భగుడిలోకి వర్షపు నీరు చేరింది. ఆలయ కమిటీ సభ్యులు ఇంజిన్లతో నీటిని బయటకు తోడుతున్నారు. కాకుమాను, అప్పాపురం చాప్టాలపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు ప్రకాశం జిల్లా కొండపి మండలం చిన్న వెంకన్నపాలెం వద్ద తు–పాను ధాటికి భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో కొండపి – టంగుటూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

**నెల్లూరులో నీటమునిగిన మాగుంట లేఅవుట్ :** మిగ్‌జాం తీవ్ర తుపాను ప్రభావంతో నెల్లూరులో భారీ వర్షం కురిసింది. నగరంలోని మాగుంట లేఅవుట్ పూర్తిగా నీటమునిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు మాగుంట లేఅవుట్‌ను ముంచెత్తింది. పలు దుకాణాల్లోకి వరద నీరు ప్రవేశించడంతో అందులోని సామాగ్రి దెబ్బతింది. ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అంతర పంటలు దెబ్బతిన్నాయి.

## తుఫాన్ నేపథ్యంలో పశ్చిమ ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి - వెలంపల్లి




**విజయవాడ,కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి నష్టం లేకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సూచించారు.ఎక్కువగా కొండా ప్రాంతం అవ్వడం ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఎదురు అవుతున్నాయా అని ఉదయం నుండి ఆయా డివిజన్ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ ఇంచార్జీ లతో మాట్లాడితే ఎప్పటికప్పుడు సమాచారం అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు ప్రజలు ఎవరు అత్యవసర సమయంలో తప్ప మిగిలిన సమయంలో బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇళ్ళమధ్య, బహిరంగ ప్రదేశాల్లో నీళ్లు నిల్వ లేకుండా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. విద్యుత్తు స్తంభాలు, తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు.

## డిజిపిని కలిసిన ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ చైర్మన్ దావులూరి తారక ప్రసాద్




**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ చైర్మన్ దావులూరి తారక ప్రసాద్ రాష్ట్ర డిజిపి కే.రాజేంద్రనాథ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తారక ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రభుత్వ, పోలీసు ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉంచేలా డిజిపి తగు చర్యలు తీసుకోవాలని ఈనెల 10వ తారీఖున మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. డి.జి.పి తారక ప్రసాద్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## తుఫాన్ బాధితులకు దుప్పట్లు పంపిణీ



**కందుకూరు,కలంకౌంటర్ :** విక్కీరాలపేట రోడ్డు సుందరయ్య నగర్ పునరావాస కేంద్రంలో తల దాచుకున్న తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ఆదేశాలతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమములో పట్టణ వైయస్సార్ సీ పీ అధ్యక్షులు ఎస్.కె. రఫీ, మండల అధ్యక్షులు గంగవరపు వెంకట్రావు, కొండి కందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య, గణేశం గంగిరెడ్డి, రహీం, మహబూబ్ బాషా తదితరులు.

## ప్రత్యేక పూజలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక ఈడేపల్లి లో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల మొదటిమంగళవారం సందర్భముగా స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు 108 గారెలుదండలు ఆంజనేయ స్వామికి ప్రీతికరమైన అప్పాలు దండలు వివిధ రకాల పువ్వులతో తమలపాకులతో అలంకరించి ప్రధాన అర్చకులు చల్లపల్లి నాగ విష్ణుమూర్తితో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మండలానికి 5 కోట్ల చొప్పున మంజూరు

### ● ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన హెూంమంత్రి



**కొవ్వూరు,కలంకౌంటర్ :** కొవ్వూరు నియోజకవర్గంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఇజిఎస్) క్రింద మండలానికి 5 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరైనట్లు రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎంఎన్ఆర్ఇజిఎస్ నిధులను కేటాయించాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం సానుకూలంగా స్పందించిందన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు దూసుకెళ్తుందని, రాష్ట్రంలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తోందన్నారు. మండలానికి 5 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల్లో ప్రతిపాదించిన పనులకు ఆమోదం అనంతరం పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో త్వరితగతిన గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని హెూంమంత్రి ఆదేశించారు.

## ఇంటర్నేషనల్ బెస్ట్ వాలంటీర్ అవార్డు 2023 గ్రహీత మన రవ్వా శ్రీనివాసులు..



**కందుకూరు,కలంకౌంటర్ :** కష్టాలు కన్నీళ్లు ఎక్కడో స్వచ్ఛంద సేవకులు అక్కడ.ఒకరు అడిగితే చేసేది దానం,... ఎవరు అడిగినా, అడగకపోయినా ఎక్కడ కష్టం ఉంటుందో, ఎక్కడ ఆపద ఉంటుందో, ఎక్కడ ఆకలి ఉంటుందో నిస్వార్ధంగా ముందుకు వచ్చి ఏదో మనకి ఉన్న దాంట్లో చిరు సాయం చేసే వాడే స్వచ్ఛంద సేవకుడు.ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ఎదుటి వ్యక్తి కష్టం తమ కష్టంగా భావించి నిరంతరము నిస్వార్ధముగా స్వచ్ఛందంగా సేవలందిస్తున్న మన కందుకూరు పట్టణానికి చెందిన లిశ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవాహృదయ రవ్వా శ్రీనివాసులు చేస్తున్న సేవలను గుర్తించి మంగళవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ వారు ఇంటర్నేషనల్ బెస్ట్ వాలంటీర్ అవార్డు 2023 కు ఎంపిక చేసి అవార్డును ఆన్లైన్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ మేము పేద ప్రజలకు, పేద విద్యార్థులకు చేస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు మనం ఫౌండేషన్ అధ్యక్షులు లాయర్ కె.చక్రవర్తి కి కృతజ్ఞతలు తెలిపారు.

## కట్టలేరు వరదను పరిశీలించిన ఏసిపి



**గంపలగూడెం (ఎన్ టీ ఆర్ జిల్లా),కలంకౌంటర్ :** రెండు రోజులుగా పడుతున్న విస్తార వర్షాలకు మండల వ్యాప్తంగా వరద నీరు పొంగుతుంది. ఈ పరిస్థితులపై మైలవరం సబ్ డివిజన్ ఏసిపి రమేష్ మంగళవారం సాయంత్రం సుడిగాలి పర్యటన చేశారు. ప్రజల అప్రమత్తతపై ఆయా పోలీస్ స్టేషన్ల ఇన్చార్జిలను ఆరా తీశారు. ఇందులో భాగంగా,స్థానిక కట్టలేరు వంతెన ప్రాంత పరిస్థితులను పరిశీలించి,సమీక్షించారు. మండలంలో ఉన్న వాగులు,వంకల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.మండల వ్యాప్తంగా,ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సైక్లోన్ సమయంలో చురుకుగా ఉండాలని స్థానిక ఎసై పి. రాంబాబుకు తెలిపారు

## మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన జిల్లా యస్.పి. డా. కె. తిరుమలేశ్వర రెడ్డి




**నెల్లూరు,కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, సహాయక చర్యలను జిల్లా ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.మొదటగా మనుబోలు హైవే, టోల్ ప్లాజా వద్ద వాహనాల రాకపోకలు, రద్దీ పరిస్థితులను ఆరా తీశారు.అనంతరం మైపాడు సముద్ర తీర ప్రాంతంను సందర్శించి, మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడి.. ప్రస్తుత పరిస్థితులు, స్థితిగతులను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు.తదుపరి వచ్చి, వెళ్ళే మార్గాలలోని పరిస్థితులను పరిశీలించి, ప్రజా జీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేసిన యస్.పి.ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి, ప్రయాణాలకు, ట్రాఫిక్ నకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశాలు.ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి తాగునీరు ఆహారంతో పాటు వసతి సదుపాయాలను అందించాలన్నారు.తుఫాన్ కారణంగా ఏమైనా అత్యవసర పరిస్థితి వచ్చినా,సంఘటనలు తలెత్తినా ప్రజలు, వెంటనే డయల్ – 100 లేదా ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్: 9392903413 కు సమాచారం తెలపాలని సూచించారు వారి వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాను సహాయక చర్యల్లో మున్సిపల్ సిబ్బంది




**కందుకూరు,కలంకౌంటర్ :** తుఫాను నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ ఆధ్వ ర్యంలో పురపాలక సంఘం సిబ్బందిపాల్గొన్నారు. సహాయక చర్యల్లో పురపాలక సంఘ శానిటే షన్ మరి ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.కూలిన చెట్లను తొలగించడం, డ్రైన్ లో ఉన్న చెత్త తొలగించడం చేయడం జరిగింది.నీరు నిలవకుండా పోయేటట్లు తగు ఏర్పాట్లు చేయడం జరిగింది.అదే విధంగా అర్ధరాత్రి టౌన్ లోపల కు వచ్చు పలు వాగుల దగ్గర పురపాలక సిబ్బంది పోలీస్ డిపార్ట్మెంట్లో సంయుక్తంగా వాగులు దాటకుండా ముళ్ళకంపలు వేయడం వంటి చర్యలు తీసుకున్నారు.అదేవిధంగా వాటర్ రాని కొన్ని ప్రాంతాలకు అనగా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడం జరిగింది ఏఎంసీ కాంపౌండ్ పాలిటెక్నిక్ కాలేజ్ సుందరయ్య నగర వద్ద అదేవిధంగా శ్రీనగర్ కాలనీ ఎక్కడికి అక్కడ బస ఏర్పాటు చేసి సుమారుగా 350 కి పైగా ప్రజలకు బస,భోజన ఏర్పాట్లు పురపాలక సంఘం చే ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు.ఎమ్మెల్యే పాలిటెక్నిక్ కాలేజీ వద్ద ఉన్న తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించడం జరిగింది.

# తుఫాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది అధైర్యపడవద్దు - మంత్రి ఆదిమూలపు సురేష్

● తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ పిఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్దినేష్ కుమార్, ఎస్పీ మలిక గర్గ్





**ఒంగోలు,కలంకౌంటర్ :** తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాల అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. ప్రభుత్వం తోడుగా ఉందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. తుఫాను వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా దృష్టి పెట్టామన్నారు. జిల్లాపై తుఫాను ప్రభావం, యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై మంగళవారం కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. తుఫాను సహాయక చర్యల సమీక్ష, సమన్వయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లాకు నియమించిన స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి పి.ఎస్. ప్రద్యుమ్నతో, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలిక గర్గ్ తో కలిసి ఆయన ఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక మంగమూరు రోడ్డులోని సత్యసాయి స్కూల్లో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని వీరు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలపై మంత్రి, ప్రద్యుమ్న ఆరా తీశారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్, ఆర్.డబ్ల్యు. ఎస్., ఆర్ అండ్ బి., పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్, సివిల్ సప్లయ్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు బాధితులందరికీ సంతృప్తికర సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. తుఫాను ప్రభావం తగ్గిన తరువాత పంట నష్టం అంచనా వేస్తామన్నారు. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఏ సీజన్ లో నష్ట పోయిన పంటకు అదే సీజన్లో పరిహారాన్ని ముఖ్యమంత్రి అందిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్ ప్రద్యుమ్న మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితులను బట్టి అవసరమైన చర్యలను యంత్రాంగం చేపట్టిందన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సెలవులను రద్దు చేసి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహాయ, పునరావాస చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. తీరప్రాంత మండలాలతోపాటు సరిహద్దు మండలాల ప్రజలను కూడా అప్రమత్తం చేశామన్నారు. పూరిళ్లు, ప్రమాదకర స్థితిలో ఉన్న పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని, ఈ శిబిరాలలో భోజనం, మంచి నీటి సౌకర్యాలతోపాటు అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి శిబిరానికి డిప్యూటీ తహశీల్దార్, ఈ.ఓ.పి.ఆర్.డి. స్థాయి అధికారులను ఇన్ ఛార్జీలుగా నియమించామన్నారు. మండల మరియు నియోజ కవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లను నియమించి సహాయ, పునరావాస కార్యక్రమాలను జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. 24 గంటలూ పనిచేసేలా కలెక్టరేట్ తో పాటు ఎస్పీ ఆఫీస్ లోనూ కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎస్పీ శ్రీమతి మలిక గర్గ్ మాట్లాడుతూ పోలీసు శాఖ తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. రోడ్లపై చెట్లు కూలిపోతే క్లియర్ చేయడానికి అవసరమైన పరికరాలతో పోలీసు, మెరైన్, ఆర్ అండ్ బి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచామన్నారు. తీరప్రాంతం, వాగులు వంకల వద్ద ప్రత్యేక పికెట్స్, బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తపట్నంలోని పల్లెపాలెం సచివాలయం, రైతుభరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రద్యుమ్న, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. శిబిరాలలో ఉంటున్న వారితో మాట్లాడి సమయానికి ఆహారం, ఇతర వసతులపై ఆరా తీయగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సముద్ర తీరప్రాంతాన్ని కూడా వారు పరిశీలించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున తీరప్రాంతానికి రావద్దని ప్రజలకు వారు సూచించారు. అధికార యంత్రాంగానికి సహకరించాలని, ప్రభుత్వం చేసిన సూచనలు పాటించాలని వారు చెప్పారు. ఈ పర్యటనలో వీరి వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు గారు, ఆర్.డి.ఓ. విశ్వేశ్వరరావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, DSB DSP బి.మరియాదాసు, ఒంగోలు డిఎస్పీ నారాయణ స్వామి రెడ్డి, సిఐలు మరియు సిబ్బంది ఉన్నారు.

# మిచౌంగ్ తుఫాన్ పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మహీధర్ రెడ్డి..

● తుఫాను బాధ్యతలకు మరోసారి ఇచ్చిన ఎమ్మెల్యే



**కందుకూరు,కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాన్ కారణంగా కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రనికి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా చేర్చారు. కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి పునరావాస కేంద్రం పరిశీలించి వారికి కావలసిన ఏర్పాట్లు తో పాటు భోజనం తదితర ఏర్పాట్లు చేశారు. తుఫాన్ బాధితులకు సహాయక చర్యలు అందించాలని వైయస్ఆర్సీపీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన పిలుపునకు స్పందించి నియోజకవర్గంలోని వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు సహాయక చర్యలో పాల్గొని తుఫాన్ పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారాన్ని అందజేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి మీరేం భయపడవద్దు నేను మీకు అండగా వుంటాను అని ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. అధికారులను కూడా అప్రమత్తం చేశారు.





చీరాల వాడరేవు ప్రాంతంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఎం ఎల్ ఏ కరణం బలరామ్ పర్యటన దృశ్యం

–చీరాల (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :




## తుఫాను కష్టాల్లో బాధితులకు అండగా పేర్ని కిట్టు..

–మచిలీపట్నం,కలంకౌంటర్ :






## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన మేయర్ చిటికిన వెంకిటేశ్వరమ్మ


–మచిలీపట్నం,కలంకౌంటర్ :



# ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



**గుడివాడ,కలంకౌంటర్ :** గుడివాడ మండలం దొండపాడు గ్రామంలో తమ్మారెడ్డి పాపారావు బజార్ లో దుస్థితి ఇది. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో అంటూ నివాసం ఉంటున్న వారు అడుగుతున్నారు.





వర్షానికి దెబ్బతిన్న పొలాలు పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు

–గుడివాడ,కలంకౌంటర్ :




రామాయపట్నం పోర్ట్ వద్ద సహాయక చర్యలలో పాల్గొన్న కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక

–కందుకూరు,కలంకౌంటర్ :



# మచిలీపట్నం లో కురిసిన వర్షాలకు నగరం జలమయం అయిన దృశ్యాలు

-మచిలీపట్నం,కలంకౌంటర్ :







# భారీ వర్షాలకు అతలాకుతలం..





**బంటుమిల్లి (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** మిచౌంగ్ తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బంటుమిల్లి మండలంలో పలు గ్రామాలలో వేలాది ఎకరాల వరి పంట నీట మునిగి అతలాకుతలంగా మారింది .అలాగే చేపల రొయ్యల చెరువులు కూడా భారీ వర్షాలు కారణంగా ముంపు గురైనవి. మండలంలో డ్రైన్ల మరమ్మతులు జరగని కారణంగా కొద్దిపాటి వర్షం వచ్చిన డ్రైన్లు పొంగి పోర్లటంతో ముంపు బాద రైతులకు తప్పడం లేదు. మండలంలోని వరి కోతలు కొంతవరకు రైతులు జరుపుకున్న కనీసం 40 శాతం మంది రైతులు కౌలు రైతులు ఈ భారీ వర్షాలకు పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని రైతులు ,రైతు నాయకులు గౌరీశెట్టి నాగేశ్వరరావు సుజ్ఞానం జనార్ధన్ రావు ,లంకదాసు అజయ్ ఘోష్ తదితరులు పేర్కొన్నారు. అలాగే బంటుమిల్లి మేజర్ పంచాయితీ అయిన డ్రైనేజీ సమస్య అనేక సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉండడంతో భారీ వర్షాలకు గ్రామంలోని లోతట్టు ప్రాంతాలైన కాలనీయులైన శివగణేష్ కాలనీ, ఎన్టీఆర్ ముస్లిం కాలనీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గల కాగిత వెంకట్రావు బిసి కాలనీ నీట మునిగాయి. కనీసం నిత్యావసరవస్తువులు తెచ్చుకునేందుకు కూడా ప్రజలు బయటికి వచ్చే దారి లేదు. అలాగే బంటుమిల్లి పట్టణంలోని బస్టాండ్ సెంటర్ లక్ష్మీపురం సెంటర్ ,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంటర్ పెట్రోల్ బంక్ ఏరియా తదితర ప్రాంతాల్లో మోకాల్లోతు నీరు రోడ్డుపై నిలిచి ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యం గురువుతున్నారు వాహనదారులే కాదు పాదచారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు తుఫాన్లు వచ్చినప్పుడు మాత్రమే కంటితుడ్పు చర్యలు తీసుకుంటున్న అధికారులు కానీ పంచాయతీ వారు గానీ మామూలు రోజుల్లో డ్రైనేజీ సౌకర్యం కల్పించడం కానీ ఉన్న డ్రైన్లలో పూడిక తీయడం గాని అంతంత మాత్రముగా చేస్తుండడంతో వర్షాలు పడినప్పుడు ప్రజలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.. ఇప్పటికైనా బంటుమిల్లి గ్రామపంచాయతీ లోతట్టు ప్రాంతాల్లో అలాగే పట్నంలోని ప్రధాన ముంపు గురయ్యే సెంటర్లను ముంపు నీరు చేరకుండా ఉన్న డ్రైన్లను సక్రమంగా పారుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.. బంటుమిల్లి మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెడన నియోజకవర్గం ఇంచార్జ్ కృష్ణ ప్రసాద్ సాతులూరు,, అర్తమూరు, పెందూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి ముంపు గురైన పంట పొలాలను పరిశీలించారు అలాగే పునరావాస కేంద్రాల్లో ఉన్న ముంపు బాదితులను పరామర్శించారు. బంటుమిల్లి మండలంలో ముంజలూరులో ఏర్పాటు చేసిన పునరావస్య కేంద్రంలో ముంపు బాధితులను ఉంచి వారికి కావలసిన ఏర్పాట్లను బంటుమిల్లి తాసిల్దార్ సత్యనారాయణ మరియు తుఫాను ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన


**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం పాతేరు గ్రామంలో మిచౌంగ్ తుఫాను ప్రభావిత ప్రాంతాలలో సహాయ చర్యల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర.





# తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



**తణుకు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో తుఫాన్ నేపథ్యంలో తేమతో సంబంధం లేకుండా ధాన్యాన్ని రైతుల నుంచి మిల్లర్లు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం ఆయన తణుకు మండలం దువ్వ, అత్తిలి మండలం వరిగేడు గ్రామాల్లో వర్షాల కారణంగా కళ్ళాల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో మాట్లాడుతూ తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సమాయత్తం చేశారని చెప్పారు. భారీ వర్షాల కారణంగా కళ్ళాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని, అందుకు తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లను కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కారణంగా ఇప్పటి వం-కు 1లక్ష 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆఫ్ లైన్ లోకొనుగోలు చేసినట్లు చెప్పారు. వీటికి సంబంధించి మొత్తం రూ. 1140 కోట్లకు రూ.800 కోట్లను ఇప్పటికే రైతుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. మరో రూ. 200 కోట్లను అందజేస్తామన్నారు. ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్తలు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తడిసిన ధాన్యం లేదన్నారు. రైతులు సాగు చేసిన స్వర్ణ రకం పంటను 98 శాతం మాసూళ్ళు పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన రకాల పంటలు అవి దృడంగా ఉండటంతో గాలులకు నేలకొరిగే అవకాశం లేదని దీనివలన పంట నష్టం ఏమీ జరగదని చెప్పారు. రైతులకు ఏవిధమైన పంట నష్టం జరగకుండా ఆదుకుంటామని మంత్రి కారుమూరి హామీ ఇచ్చారు.

# ప్రజాసేవకు చిరునామా నిజాం

- పేదలకు ఆపద్బాంధవుడు
- పదవి లేకున్నా ప్రజాసేవ లో



**పిట్టల వానిపాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** ప్రస్తుతం తుఫాన్ కారణం గా అనేక గ్రామాలలో పేదలు నిర్వాసితులుగా మారి పస్తులుండే పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి ఛందోలు గ్రామంలో కూడా ఏర్పడింది. ఇది గమనించిన గ్రామ, ప్రజా సేవకుడు నిజాం తన సొంత నిధులతో పేదలకు, నిర్వాసితులకు ఆహారం అందించారు. పదవులు ఉన్న నాయకులు చేయలేనిది పదవి లేకున్నా ప్రజా సేవే ముఖ్యం అనుకుంటూ చేస్తున్నారు. ఇంతే కాకుండా గాలి, వాన విపరీతం గా ఉన్న అక్కడికి ఒక్క అధికారి కూడా వెళ్లలేని స్థితిలో ధైర్యంగా ముందుకు సాగారు నిజాం. పేదల ఓట్లు కోసం వచ్చే నాయకులు తమ గోడు వినటానికి ఒక్కరు కూడా రాలేదు అంటూ అక్కడి ప్రజలు మండిపడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు కరువై పస్తులు ఉంటున్న సమయం లో అన్నదాత గా నిజాం రావటం అక్కడి ప్రజల కు ఆనందాన్ని నింపింది. ఏది ఏమైనా పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేస్తున్న నిజాం అభినందనీయుడు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com